జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

నిజామాబాద్ | ఆదివారం 5 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 145 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం సూర్యోదయం: 5:31 సూర్యాస్తమయం: 6:33 చంద్రోదయం: 10:24 , చంద్రాస్తమయం: 9:46 తిథి: బహుళ పంచమి ఉ. 9:47 వరకు, తదుపరి షష్ఠి నక్షత్రం: శతభిషం మ. 12:29 వరకు, తదుపరి పూర్వాభాద్ర యోగం: ఆయుష్మాన్ మ. 2:48 వరకు, తదుపరి సౌభాగ్యం, కరణం: తైతుల ఉ. 9:47 వరకు, తదుపరి గరజ రా. 9:38 వరకు, తదుపరి వణిజ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com




# పల్లె రహదారులకు మహర్దశ

## హ్యామ్ విధానంలో 30 మార్గాల నిర్మాణం



బోధన్: బోధన్ నియోజకవర్గంలోని పల్లె రహదారులకు మహర్దశ పట్టనుంది. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకుండా కంకర లేచి.. గుంతలు పడి అధ్వానంగా ఉన్న పల్లె దారులు హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ (హ్యామ్) విధానంలో ఆధునికీకరించి నిర్మించనున్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో ఎంపిక చేసిన రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ విధానంలో మొదటి విడతలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 30 రోడ్లు 71.79 కిలోమీటర్ల మేర నూతనంగా నిర్మించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇటీవల రూ.52.70 కోట్లు మంజూరు చేసింది.

మండలాల వారీగా నిర్మించనున్న రోడ్లు ఇవే..

బోధన్ ఉమ్మడి మండలం : ఊట్‌పల్లి – అప్రోచ్‌రోడ్డు, నాగన్‌పల్లి – సాలంపాడ్, నాగన్‌పల్లి – బండారుపల్లి, సాటాపూర్ గేట్ – పెంటాకలాన్, ఖండ్‌గాం – కొప్పర్గ, నర్సాపూర్ – శక్కర్‌నగర్, అప్రోచ్‌రోడ్ సాలూర, ఆచన్‌పల్లి – మావందికలాన్, అప్రోచ్‌రోడ్ – పెంటాకలాన్, మావందిఖుర్దు– కల్దుర్కి, బెల్లాల్– రాకాసిపేట్.

రెంజల్ : బాగేపల్లి – రాంపూర్, రెంజల్ – సాటాపూర్, నీలా– కొప్పర్గ.

ఎడపల్లి : అంబం – భూలక్ష్మిక్యాంపు, సాటాపూర్ గేట్ – ఏఆర్పీక్యాంపు, దూపల్లి – పోచారం, ఠాణాకలాన్ – వడ్డేపల్లి, మంగళ్‌పాడ్ – మోస్రా క్రాస్ రోడ్డు

నవీపేట : ఫకీరాబాద్ – కోస్లీ, కమలాపూర్ క్యాంపు – జన్నేపల్లి, పీడబ్ల్యూడీ – దర్యాపూర్, శ్రీరామ్‌తండా – అప్రోచ్‌రోడ్డు, బినోలా – గోదావరి పుష్కర్‌ఘాట్, జలాల్‌పూర్ – సలీంఫారం– అనంతగిరి, అంజుమన్‌ఫారం– కమలాపూర్ క్రాస్ రోడ్డు, అంజుమన్‌ఫారం – రెడ్డిఫారం, ఫత్తేనగర్

# హత్య కేసులో ముగ్గురి రిమాండ్



**మోపాల్**

న్యాల్‌కల్‌లో జరిగిన ఓ వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ సీఐ సురేశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గత నెల 27న గల్ఫ్ నుంచి దాయిని ప్రశాంత్ (35) అనే వ్యక్తి ఇంటికి వచ్చాడు. 30న మద్యం మత్తులో ఇంటి డాబాపై నుంచి పడి మృతి చెందడంపై అతని తల్లి శ్యామల అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. అసలు విషయాలు వెలుగు చూశాయి. ప్రశాంత్ భార్య సంధ్య(32)కు నగరంలోని ఇంద్రాపూర్ కాలనీకి చెందిన అనిల్(35)తో వివాహేతర సంబంధం ఉంది. అందుకు అడ్డుగా ఉన్న ప్రశాంత్‌ని వారు హత్య చేయాలనుకున్నారు. ఇందుకు న్యాల్‌కల్ గ్రామానికి చెందిన కంది వెంకటసాయి అలియాస్ బంటి(24) సహకారం తీసుకున్నారు. గత నెల 29న వెంకటసాయి.. ప్రశాంత్ ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ కలిసి మద్యం తాగారు. తర్వాత ప్రశాంత్‌ను డాబాపైకి తీసుకెళ్లి కిందకు తోసేశాడు. గాయపడిన అతనిని ఎవరికీ అనుమానం రాకుండా సంధ్య, వెంకటసాయి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడికి అనిల్ కూడా వచ్చాడు. మెరుగైన చికిత్స నిమిత్తం రాత్రి సమయంలో ప్రశాంత్‌ను నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. అనిల్ సహాయంతో సంధ్య తన వద్ద ఉన్న మత్తు మాత్రలతో తయారు చేసిన ఇంజక్షన్‌ను, టాయిలెట్ క్లీనర్‌ను ప్రశాంత్ చేతికి ఉన్న కాన్యూలా ద్వారా ఎక్కించారు. తర్వాత మంచంపై నుంచి కిందకు తోసి హత్య చేసినట్లు విచారణలో తేలిందని సీఐ పేర్కొన్నారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాలు, సాంకేతిక సాక్ష్యాలతో పాటు ముగ్గురు నిందితులు తమ ప్రమేయాన్ని అంగీకరించడంతో జడ్జి ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌వో సుస్మిత, సిబ్బంది ఉన్నారు.

# కుటుంబమంతా ముఠాగా ఏర్పడి.. ప్రయాణికుల గొలుసులు మాయం




**నిజామాబాద్**

బస్టాండ్లలో వృద్ధురాళ్లే లక్ష్యంగా బంగారు గొలుసులు, పర్సులు చోరీచేస్తున్న ముఠా ఆటను కమిషనరేట్ పోలీసులు కట్టించారు. ఓ కుటుంబానికి చెందిన వారే ముఠాగా ఏర్పాటై చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ శనివారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నవీపేట్ బస్టాండ్‌లో గతనెల 17న బస్సు ఎక్కుతున్న ప్రయాణికురాలు విజయలక్ష్మి మెడలోంచి బంగారు గొలుసును దొంగలు మాయం చేశారు. ఈ కేసుపై నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని బృందం దర్యాప్తు ప్రారభించింది. ఈ నేపథ్యంలో బంగారాన్ని అమ్ముకునేందుకు కొందరు కారులో వెళ్తున్నారనే సమాచారం అందడంతో నవీపేట్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన ఖుతీజా బేగం(67), ఆమె కూతురు నజ్మాబేగం(29), కుమారుడు అంజద్ (39), కోడలు తాహెరా(అంజద్ భార్య), వీరి కుటుంబానికే చెందిన అబ్దుల్ జుబైర్, షేక్ వసీం అహ్మద్‌ను అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. నవీపేట్‌తో పాటు నిజామాబాద్ ఒకటో ఠాణా, నందిపేట్ పరిధిలో ఐదుగురు ప్రయాణికుల గొలుసులు, సొత్తు చోరీ చేసినట్లు అంగీకరించారు. గతంలో ఆర్మూర్‌తో పాటు నిర్మల్ జిల్లాలోనూ పలు దొంగతనాలకు పాల్పడి జైలుకెళ్లొచ్చారు. రూ.పది లక్షల విలువైన బంగారు ఆభరణాలు, కారును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసును వెంటనే ఛేదించిన సీఐ, ఎస్సైతో పాటు సిబ్బంది గఫార్, రాజేశ్వర్, రాజారెడ్డి, రాకేష్, సర్దార్‌సింగ్, శ్రీకాంత్, దత్తాత్రేయను అభినందించారు.

